ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాపములు

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

**OFFICIAL REPORT**

సోమవారము, జూలై 15, 2002

11శా. స. VIII స. వాల్యూం -- VI నంబరు -- 1

శకసంవత్సరము - 1924, ఆషాఢం - 24

## MONDAY, THE 15th JULY, 2002

**11 L.A. VIII S. VOL-- VI No. - 1**

***24- ASHADH , 1924 - S.E.***

#


శాసనసభ సచివాలయము

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు - 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీమతి కె. ప్రతిభా భారతి |
| ఉప సభాపతి | : | శ్రీ కె. హరీశ్వరరెడ్డి |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ ఎం .వి. కృష్ణారావు |
| | | శ్రీమతి బి. శోభానాగిరెడ్డి |
| | | శ్రీ కె. జయరాం |
| | | శ్రీ సి. ముత్యంరెడ్డి |
| | | శ్రీ డి.ఎస్. రెడ్యానాయక్ |
| | | శ్రీ కె. హరిబాబు |
| కార్యదర్శి | : | శ్రీ కె. తుల్జానంద్ సింగ్ |
| సంయుక్త కార్యదర్శులు | : | శ్రీ ఎస్. వి. రామిరెడ్డి |
| ఉప కార్యదర్శులు | : | శ్రీమతి వి. జయకుమారి |
| | | శ్రీ పి.కాశిరాజు |
| | | శ్రీ కె. హరినారాయణ రావు |
| | | శ్రీ పి. వెంకటరామారావు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ ఎం .ఎ.సిద్దిఖీ |
| | | శ్రీ ఎస్.ఆర్.సి. నర్సరాజు |
| | | శ్రీ బి. పద్మారెడ్డి |
| | | శ్రీ మహమ్మద్ దావూద్ అలీ |
| | | శ్రీ జి. ఎస్. గోపాలకృష్ణ |
| | | శ్రీ జి . నారాయణరెడ్డి |
| | | కుమారి బి.కె.ఆర్.లక్ష్మి |
| | | శ్రీ ఐ. రాధాకృష్ణమూర్తి |
| | | శ్రీ షాబాష్‌ఖాన్ |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ ఎస్. రాజ సదారామ్ |

-------

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు
# అధికార నివేదిక

## ( ఎనిమిదవ సమావేశము : మొదటిరోజు )
## సోమవారము, జూలై 15, 2002
## సభ ఉ. గం. 9 .30 ని. లకు సమావేశమైంది
## ( గౌ. సభాపతి అధ్యక్షస్థానములో వున్నారు )

------

### విషయ సూచిక


1. సంతాప ప్రతిపాదన

ఉన్నత విద్యాశాఖా మంత్రి శ్రీ కరణం రామచంద్రరావు మృతిపట్ల .

--------

## సంతాప ప్రతిపాదన

## ఉన్నత విద్యాశాఖా మంత్రి శ్రీ కరణం రామచంద్రరావు మృతిపట్ల

మేడమ్ స్పీకర్: శ్రీ కరణం రామచంద్రరావు గారి మృతిపట్ల సభా నాయకుడు సంతాప ప్రతిపాదనను మూవ్ చేస్తారు.

శ్రీ యన్. చంద్రబాబునాయుడు : '' ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులు శ్రీ కరణం రామచంద్రరావు గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది''.

మేడమ్ స్పీకర్: మోషన్ మూవ్డ్.

శ్రీ యన్. చంద్రబాబునాయుడు: అధ్యక్షా, కరణం రామచంద్రరావుగారు 1940 సంవత్సరం జూన్ 10వ తేదీ నాడు జన్మించారు. ఆయన జన్మస్థానం మెదక్ జిల్లాలోని కొత్తపల్లి గ్రామం . ఆయన తండ్రి శ్రీ కరణం రామారావు గారు.

ఆయన మెదక్‌లో బియస్‌సి వరకు చదివారు. ఆయన గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో పుట్టడమే కాకుండా వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించారు. వారు 24 సంవత్సరాల వయసులోనే గ్రామీణాభివృద్ధి పట్ల శ్రద్ధ చూపుతూ, 1964లో కొత్తపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైనారు. ఆయన యువకుడుగా వున్నప్పటి నుండి సామాజిక వికాస కార్యక్రమాల్లోను, గ్రామీణ పునర్నిర్మాణ కార్యక్రమాల్లోను ఎంతో చురుకైన పాత్రను నిర్వహించారు.

ఆయన హౌస్‌లోను అందరికీ పరిచితులు. ఆయన మృదుభాషిగా, సాత్వికుడుగా వుంటూ, నిరాడంబరం జీవితాన్ని గడిపారు. వారు అందరికీ సన్నిహితులయ్యారు. అంతే కాకుండా గాంధీజీ ప్రబోధించినటువంటి '' శాంతి, అహింస, నిర్మాణాత్మక కృషి'' , వీటిని పరమావధిగా చేపట్టి అంచెలంచెలుగా వారు ఈ స్థాయికి చేరారు. ఆయన కొత్తపల్లి సర్పంచ్‌గా ''ఏడుపాయల దుర్గాభవాని'' ట్రస్ట్ చైర్మన్‌గా, జోగిపేట వ్యవసాయాభిద్ధి బ్యాంక్ చైర్మన్‌గా పని చేశారు.

శ్రీ కరణం రామచంద్రరావు గారు 1983లో కీర్తిశేషులు నందమూరి తారక రామారావు గారి ఆశయాలకు, ఆదర్శాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరడం, మెదక్ శాసనసభ్యుడుగా ఎన్నిక కావడం జరిగింది. ఆయన యన్. టి. రామారావు గారి ప్రభుత్వంలో 9.1.83 నుండి 16.8.84 వరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన 17.9.84 నుండి 9.3.85 వరకు సహకార శాఖ మంత్రిగా పనిచేశారు. 9.3.85 నుండి 8.2.89 వరకు , 12.12.94 నుండి 1.9.95 వరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పని చేశారు. అంతే కాకుండా ఆయన మంత్రిగా వున్నప్పుడే మాండలిక రాజ్యాంగ పరిపాలనా వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. మండల వ్యవస్థను ఏర్పాటు చేసింది వారు పంచాయతీరాజ్ మంత్రిగా వుండగానే అనే విషయం తెలియజేసుకుంటున్నాను. అంతే కాకుండా ఆయన ఎంతో కష్టపడి పంచాయతీరాజ్ వ్యవస్థను, ముఖ్యంగా మాండలిక వ్యవస్థను పటిష్టపరచడం జరిగింది. ఆవిధంగా వారు ఎంతో కష్టపడి పనిచేశారు. 1989లో శ్రీ కరణం రామచంద్రరావుగారు ఆరు నెలలపాటు ఎపిఐడిసి చైర్మన్‌గా పనిచేశారు. 1997 నుండి 1999 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రభుత్వ సంస్థల సమితికి చైర్మన్‌గా పనిచేశారు. 1999 అక్టోబర్ 22 నుండి ఉన్నత విద్యాశాఖ మంత్రిగా వారు పనిచేశారు. అధ్యక్షా, ఆయన విద్యా మంత్రిగా వున్నప్పుడు కూడా అనేక సంస్కరణలకు నాంది పలకడం జరిగింది. పరీక్షలను సకాలంలో జరపడం కోసం, యూనివర్సిటీస్‌ను అటానమస్‌గా చేయడం కోసం, ఆర్థికంగా పరిపుష్టం చేయడం కోసం ఆయన అనేక విధాల కృషి చేయడం జరిగింది. మెదక్ జిల్లా అభివృద్ధికి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఆయన తనవంతు సేవలు అందించి ముందుకు పోయారు. ఆయన ఎప్పుడు ఎక్కడ మాట్లాడినా '' కాలం మారిన కొద్దీ నైతిక విలువలు పడిపోతున్నాయి. వాటిని పునరుద్ధరించడం కోసం నా ఊపిరి వున్నంత కాలం పాటుపడతాను. సమాజ సేవే నా లక్ష్యం . విలువలతో కూడిన రాజకీయాల కోసం పోరాడతాను'' అని అనేక సందర్భాలలో చెప్పడమే కాకుండా, అదే భావాలతో, ఎవరికీ హాని తలపెట్టకుండా, ప్రతిఒక్కరికి సహాయం చేస్తూ ముందుకు పోయారని తెలియజేసుకుంటున్నాను. ఆవిధంగా ఒక ఆదర్శ

ప్రజానాయకుడుగా వారు తమ మనుగడను కొనసాగించారు. ఆయన ప్రజల మనిషి . వారు నన్ను ఎప్పుడు కలిసినా ప్రజల సమస్యలను గురించే అడిగేవారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వారు నాతో చాలాసార్లు మాట్లాడడం జరిగింది.

వారు గత శాసనసభ సమావేశాల్లో మనతో వున్నారు. ఇదే అసెంబ్లీలో సమాధానం చెబుతూ, మధ్యలో అనారోగ్యంతో వారు హాస్పిటల్‌లో చేరారు. ఆయన మంత్రిగా వుంటూ శాసనసభ జరిగే రోజుల్లో కూడా రాత్రింబవళ్లు టూర్స్ చేయడం, లేట్ నైట్స్ తిరగడం వల్ల వారికి జాండిస్ రావడం జరిగింది. " అవసరమైతే మరొక రెండు రోజులు శాసనసభ సమావేశాలకు అటెండ్ అయిన తరువాత హాస్పిటల్‌లో చేరతాను"అని వారంటే " అలా కాదు. మీకు ఆరోగ్యం బాగాలేదు. హాస్పిటల్‌కు వెంటనే వెళ్లండి" అని వారిని హాస్పిటల్‌కు పంపడం జరిగింది. వారు హాస్పిటల్‌లో అడ్మిట్ అయినారు. నేను రెండు, మూడు సార్లు హాస్పిటల్‌కు వెళ్లాను. ఆయన జాండిస్ వల్ల రికవరీ కాలేకపోయారు. డయాబెటిస్ కారణంగా మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్ అయినాయి. జర్మనీ ఎక్విప్‌మెంట్ కావాలంటే రు.25 లక్షలు పెట్టి ఆ ఎక్విప్‌మెంట్‌ను తెప్పించాము. అయినా ఆయనను కాపాడుకోలేకపోయినాము. వారు 51 రోజులు మృత్యువుతో పోరాడి, కడకు భగవంతుని నిర్ణయానుసారం పరమపదం పొందడం జరిగింది. ఆవిధంగా ఆయన చనిపోయారు. ఆయనకు చనిపోయేనాటికి 62 సంవత్సరాల వయసు. ఆయనకు యిద్దరు కుమారులు, యిద్దరు కుమార్తెలు వున్నారు. ఆయన సతీమణి శ్రీమతి ఉమ.

ఆయన మృతి రాష్ట్రానికి, ముఖ్యంగా మెదక్ జిల్లాకు తీరని లోటు అని తెలియజేసుకుంటున్నాను. ప్రజా జీవితంలో విలువలకు ప్రమాణంగా వారు జీవితాన్ని గడిపారు. చిత్తశుద్ధితో పనిచేసిన నాయకులు కరణం రామచంద్రరావు గారు. ఒక మంచి నాయకుడిని మనం కోల్పోవడం జరిగింది. ఆవిధంగా ఆయన చనిపోయిన తరువాత , మెదక్ శాసనసభా స్థానానికి జరిగిన ఉప ఎన్నిక లో వారి సతీమణిని అభ్యర్థిగా నిలబెట్టగా, ఆమె మంచి మెజారిటీతో గెలిచిన విషయం తెలియజేసుకుంటున్నాను. ఆమె మనో నిబ్బరంతో, ఆయన అడుగుజాడలలో నడుస్తూ వారి ఆశయశిద్ధికి కృషి చేయాలని కోరుతున్నాను. ప్రభుత్వ పరంగా కూడా , రామచంద్రరావు గారి ఆలోచనలకు, ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలియజేసుకుంటూ, వారిఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు, బంధువులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ తమ దగ్గర సెలవు తీసుకుంటున్నాను అధ్యక్షా.

డా. వై.యస్. రాజశేఖరరెడ్డి(పులివెందుల): అధ్యక్షా, మొన్నటివరకు మనతోబాటు సభ్యునిగా వుండి, ఈనాడు భగవంతుని సన్నిధికి వెళ్లిన శ్రీ కరణంరామచంద్రరావుగారిమృతి పట్ల కాంగ్రెస్ శాసనసభా పక్షం తీవ్రవిచారం వ్యక్తపరుస్తున్నది.

అధ్యక్షా, ఆయనగురించి ఎవరు ఎప్పుడు, ఎక్కడ మాట్లాడినా జంటిల్‌మ్యాన్ పొలిటీషియన్ అనో, ఎన్ని రకాల యిబ్బందికరమైన పరిస్థితుల్లో కూడా He was always unrepelled person అనో అనేవారు. ఆయన ప్రతి విషయం గురించి క్షుణంగా ఆలోచన చేయగలిగిన శక్తి వున్న వారు అని కూడా విన్నాను. ఆయన గురించి మంచి మాటలే విన్నాను తప్ప, ఆయన గురించి ఏ ఒక్కరోజు యిబ్బందికరంగా ఏ ఒక్కరి నోట వినలేదు.
ఉ.9.40

అటువంటి మంచి మనిషి తన 62వ ఏట మృతి చెందడం చాలా బాధాకరం . అప్పటికే ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్నారు. పంచాయితీ బోర్డు సభ్యుడి స్థాయి నుండి ఎదిగి, అయిదుసార్లు శాసనసభ్యులుగా ఎన్నికై, తాను మంత్రిగా పనిచేసిన పంచాయితీరాజ్ మరియు విద్యాశాఖలపై తనదైన ప్రత్యేకమైన ముద్ర వేశారు. ఆయన ఈవేళ మనతో లేకపోవడం చాల బాధాకరమైన విషయం . భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబానికి

అన్ని రకాలుగా మేలు జరగాలని కోరుకుంటూ, కాంగ్రెస్ శాసనసభ పక్షం తరపున, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టినవంటి తీర్మానాన్ని బలపరుస్తున్నాం .

శ్రీ ఎన్. ఇంద్రసేనారెడ్డి (మలక్‌పేట్):- అధ్యక్షా, 1983లో మొట్టమొదటగా నేను ఎంఎల్‌ఏ గా ఎన్నికైనపుడు, కరణం రామచంద్రరావుగారు కూడ శాసనసభలో పంచాయితీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నారు. అప్పటి నుండి నాకు వారితో పరిచయం ఉంది. వారి మాటల్లోగాని, ముఖంలో గాని ఎప్పుడూ అసహాయత గాని, అయిష్టత గాని చూపక, ఏ పని చెప్పినా పాజిటివ్‌గా స్పందించి, సరే అనేవారు. ఒకవేళ సాధ్యంకాకపోతే, దానిని ఈ రకంగా చేద్దాం అనే పాజిటివ్‌గా సలహా ఇచ్చేవారు తప్ప ఇంకొకటి కాదు. వారు చేపట్టిన పంచాయితీరాజ్‌శాఖ మరియు విద్యాశాఖల్లో అనేక మార్పులు తెచ్చి ముందుకు తీసుకొని వెళ్లే ప్రయత్నం చేశారు. అటువంటి వారు ఈ రోజు మనలో లేరు. వారు సర్పంచ్‌గా, సమితి ప్రెసిడెంట్‌గా, నాకు తెలిసినంతవరకు 1972వ సం .లో ఇండిపెండింట్‌గా కంటెస్టు చేసి గెలిచి, వారికంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని మెదక్ జిల్లాలో నిలబెట్టుకున్నారు. వెనుకబడిన మెదక్ జిల్లా అభివృద్ధికి కృషి చేసినటువంటి వారు ఈ రోజు లేకపోవడం ఎంతో విచారకరమైన విషయమని తెలియచేసుకుంటున్నాను . బిజెపి లెజిస్లేటివ్ పార్టీ తరఫున వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ, వారి ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి ఈ సంతాప తీర్మానాన్ని బిజెపి లెజిస్లేటివ్ పార్టీ తరఫున బలపరుస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ నోముల నర్సింహయ్య (నక్రెకల్):- అధ్యక్షా, కరణం రామచంద్రరావుగారు వివిధ స్థాయిల నుండి ప్రజా ప్రాతినిధ్యం వహిస్తూ, అనుభవం కల్గిన ఒక మంచి నాయకుడుగా పేరు పొంది, పోయిన సెషన్స్ వరకు మన మధ్యన ఉన్న వారు ఈ రోజున లేకపోవడం చాల విచారకరం . పోయిన సెషన్‌లో ఈ ప్రక్కనే కూర్చొని జవాబులు చెప్పలేని స్థితిలో బాగా ఆయాసపడుతూ , మిత్రుడు లక్ష్మణ్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెపుతూ ఉంటే, నేను ఆయన ప్రక్కకు వెళ్లి ఇక్కడకు ఎందుకు వచ్చారు, హాస్పిటల్‌కు వెళ్లి చూపించుకోండి అనిచెప్పాను. అదే రోజు సాయంత్రం వారు ఆసుప్ర లో జాయిన్ అయ్యారు. నేను హాస్పిటల్‌కు వెళ్లి డాక్టర్లను విచారించినపుడు, వారు బాగా నిర్లక్ష్యం చేసి, ఎక్కువగా స్ట్రెయిన్ అయ్యారు, సకాలంలో చూపించుకోకపోవడం వల్ల కిడ్నీలు పాడైపోయాయి, అందువల్లే ఈ పరిస్థితి దాపురించిందని డాక్టర్లు చెప్పారుఆ విధంగా తన ఆరోగ్యం కంటె తాను చేస్తున్న పని మీద పట్టుదలను చూపించిన ఆయన్ను మంచి నాయకుడుగా నేను అభివందిస్తున్నాను. అలాంటి నాయకుడు మన మధ్యలేకపోవడం చాల విచారకరం . లాస్ట్ సెషన్‌లో ఆయన వచ్చిన చివరి రోజున జీరో అవర్‌లో నా నియోజకవర్గంలో ఇంటర్మీడియేట్ కాలేజీ ఏర్పాటు గురించి అడిగినపుడు పాజిటివ్ చేద్దాం అని చెప్పారు. తానొవ్వకుండా, ఇతరులను నొప్పించకుండా ఏదో ఒక పద్ధతిలో ప్రతిసారీ సమాధానం చెప్పి, ఎంత జటిలమైన సమస్యను అయినా చాల సున్నితంగా, సునిశితంగా వ్యవహరించేవారు. వారి మృతి పట్ల సిపిఎం శాసనసభ పక్షం తరపున సానుభూతి సంతాపం తెలియచేస్తూ, వారి కుటుంబానికి సానుభూతి ప్రకటిస్తూ, ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియచేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ కె . చంద్రశేఖర్‌రావు(సిద్దిపేట) :- అధ్యక్షా, స్వర్గీయ కరణం రామచంద్రరావుగారి మృతి చాల విచారకరం, బాధాకరం . వారు నా స్వంత జిల్లాకు చెందిన వారు. రెండున్నర దశాబ్దాలపాటు సహచరులుగా మేము కలిసి పనిచేశాం . ముఖ్యమంత్రిగారు సెలవిచ్చినట్లుగా, నిగర్వి. వీలైనంతవరకు, అవకాశం ఉన్నంతవరకు వివాదరహితుడుగా ఉండేటటువంటి పద్ధతుల్లో వారు పనిచేసేవారు. వారు ఒకసారి ఆసుపత్రిలో చేరిన తరువాత, తిరిగి అక్కడి నుండి రాకుండానే చనిపోవడం జరిగింది. ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, అనుకోని పద్ధతిలో మృతి చెందడం చాల బాధకరమైనది. వారి ఆత్మకు శాంతి కలుగచేయాలని

భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు తెలంగాణా రాష్ట్ర సమితి పక్షాన ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ టి. దేవేందర్‌గౌడ్ : అధ్యక్షా, కరణం రామచంద్రరావుగారి యొక్క మృతి ఒక్క మెదక్ జిల్లాకే కాకుండా, యావత్తు రాష్ట్రానికే తీరని నష్టం కలుగచేసింది. మనందరికీ తెలుసు-- ఎంతో రాజకీయ అనుభవం కల్గినటువంటి వ్యక్తి. క్యాబినెట్‌లో మా అందిరికన్నా వయస్సులో చాల పెద్దవారు, సీనియర్ పొలిటిషియన్. ఆయన పెద్ద వ్యక్తిగా వారిని మేమంతా గౌరవంగా చూసుకొనే వాళ్లం . ఒక గ్రామ సర్పంచ్ స్థాయి నుండి కోఆపరేటివ్, విద్యాశాఖ మంత్రుల వరకు ఎదిగారు. గ్రామీణ వ్యవస్థ నుండి శాసనసభ స్థాయి వరకు ఎంతో అనుభవం గడించారు. వారు పంచాయితీరాజ్ మినిస్టర్‌గా ఉన్నప్పుడే ఎంతో జటిలమైన వ్యవస్థకు సంబంధించిన మాండలిక వ్యవస్థ ఏర్పాటు గురించి ప్రయత్నం చేసి, ఎంతో సునిశితంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా ప్రవేశపెట్టారు. ఆ విధంగా నూతన పంచాయితీరాజ్ వ్యవస్థకు అంకురార్పణ చేశారు. పంచాయితీ, విద్యా శాఖల మంత్రులుగా పూర్తిగా తమ పనిలో నిమగ్నమై పనిచేశారు. నిర్దిష్ట ప్రమాణాలతో వారు పనిచేశారు.

గత సెషన్ టైమ్‌లో వారుచాల వీక్‌గా కనిపించారు. అంతకు ముందు రెండు రోజుల క్రితం కొంత మంది శాసనసభ్యులతో మా ఇంటికి రావడం జరిగింది. ఆనాడు సభలో జవాబులు చెప్పడానికి కూడ చాల బాధపడ్డారు. ఆ రోజు మధ్యాహ్నం మెదక్ జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ పనుల కోసం ఒక సెపరేట్ ప్యాకేజ్ ఏర్పాటు గురించి ఆఫీసర్స్‌తో ఒక మీటింగ్ జరగవలసి ఉన్నది. ఆ మీటింగ్‌కు తాను వస్తానని ఆయన చెప్పితే, మీరు చాల వీక్‌గా ఉన్నారు, కావాలంటే ఇంకొక రోజు మనం మీటింగ్ పెట్టుకోవచ్చునని చెప్పాను. లేదూ నేను వస్తానని మళ్లీ ఆయన అన్నా, నేనే వద్దని చెప్పాను. అంతలోనే సాయంత్రం అయిదు గంటలకు హాస్పిటలైజ్ అయ్యారని తెలిసింది. మొదట్లో కోలుకొంటారని బాగా ఆశగా ఉండేది. ఆరోగ్యం గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని డాక్టర్లు చెప్పారు. మనం సైంటిఫిక్‌గా ఎంత అభివృద్ధి చెందిన, ఎన్ని ఆధునిక పరికరాలు సమకూర్చుకొంటున్నా, విధిని మనం తప్పించుకోలేం . గౌరవ ముఖ్యమంత్రిగారు, హెల్త్ మినిస్టర్‌గారు రెగ్యులర్‌గా వారి ఆరోగ్యం గురించి కనుక్కొంటూ వారిని రక్షించుకోవడానికి ఎన్నో విధాలుగా ప్రయత్నాలు చేశారు.
ఉ.9.50

కాని అది దైవ నిర్ణయం. మనం ఏమీ చేయలేకపోయాం. వారిపుడు మన మధ్య లేరు. వారు చేసిన కృషి, వారి సేవ ఎల్లవేళలా జిల్లాకే కాక, యావత్ రాష్ట్రం ఎప్పటికీ మరచిపోరు. వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసుకుంటూ, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ పి. కిష్టారెడ్డి (నారాయణ్‌ఖేడ్):- మేడమ్ స్పీకర్, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, మాలో ఒకడిగా, పది సంవత్సరాలు కలిసి పనిచేసే అవకాశం కలిగిన వ్యక్తి, సహనశీలుడు, సౌమ్యుడు ఈ రోజు మా మధ్య లేకపోవడం చాలా విచారకరంగా ఉంది. 1972 నుంచి జిల్లా పరిషత్తులో అన్ని విధాలా కలిసి పని చేయడం, రాష్ట్ర శాసన సభ్యుడిగా, మంత్రిగా ఉంటూ కలిసి పనిచేయడం, ఏ విషయం వచ్చినప్పటికీ, ఏ డెవలప్‌మెంట్ విషయం వచ్చినప్పటికీ పార్టీ రహితంగా వారు జిల్లాకు సేవ చేశారు. దేవేందర్‌గౌడ్ గారు మా జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రి అయినప్పటికీ కూడా వారితో ఒకసారి డీడీఆర్‌సీ మీటింగుకు రావడం, పరిచయం చేయడం, జిల్లా లో శాసనసభ్యులందరితో కలిసి పని చేయడం, పార్టీ రహితంగా పని చేద్దామని వారితో చెప్పడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. ఎంత క్లిష్టమైన సమస్య వచ్చినప్పటికీ కూర్చుని చర్చించి, ఒక్క మాట కూడా ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడకుండా ఎన్నో సంవత్సరాలుగా సేవ చేసిన గొప్ప వ్యక్తి ఆయన. వారు ఈ రోజు మన మధ్య లేరు.

వారు మెదక్ జిల్లాకు చేసిన సేవ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, వారికి ఆత్మశాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేసుకుంటున్నాను.

శ్రీ కె. విజయరామారావు :- అధ్యక్షా, కరణం రామచంద్రరావు గారితో సుమారు 35 సంవత్సరాలకు పైగా నాకు పరిచయం ఉంది. ఆయన శాసనసభ్యులుగా ఉన్నపుడు, ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నిక కావడం, పంచాయతీరాజ్ మంత్రివర్యులుగానూ, తర్వాత కోఆపరేటివ్ మంత్రివర్యులు గానూ, విద్యా శాఖ మంత్రివర్యులు గానూ వారిని నేను చాలాసార్లు కలవడం తటస్థించింది. ఆయన మృదుభాషి. మిత భాషి. తెలుగులో చాలా స్పష్టంగా అనుకున్న విషయాన్ని చెప్పగలిగిన శక్తి ఉన్న వ్యక్తి. 50 రోజులుగా వారు మృత్యువుతో పోరాడుతున్నపుడు చాలాసార్లు నేను 'నిమ్సు' ఆసుపత్రిలో చూడటం జరిగింది. కాని దురదృష్టవశాత్తు ఒకసారి కూడా మాట్లాడే అవకాశం కలగలేదు. ఒకరోజు వారిని వీల్‌ఛైర్‌లో ఉండగా మాట్లాడించడానికి ప్రయత్నం చేసినపుడు, వారు గుర్తు పట్టలేని స్థితిలో ఉండటం, వారి శరీరం రంగు కూడా నల్లగా మారిపోయి ఉండటం, మొహంలో కళ లేకపోవడం చూసి నాకు చాలా బాధ కలిగింది. వారిని ఎలాగైనా బ్రతికించాలని డాక్టర్సు చాలా ప్రయత్నం చేశారు. ప్రత్యేకంగా ఒక ఎక్విప్‌మెంటును కూడా తీసుకువచ్చి, దానిని వాడుతూఉండగా కొంత ఇంప్రూవ్‌మెంటు ఏదో కనబడినట్లే కనిపించి, మళ్లీ ఆయన కోమాలోకి వెళ్లిపోవడం, ఇవన్నీ చూసినపుడు చాలా బాధ కలిగింది.

వారు పంచాయతీరాజ్ మంత్రివర్యులుగా ఉన్నపుడు ఒక సంచలనాత్మకమైన పరిపాలనా వ్యవస్థ మార్పుకు ముఖ్యమైన పాత్ర వహించిన శ్రీ కరణం రామచంద్రరావు గారు చరిత్రలో నిలిచిపోయారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలియజేస్తూ, ముఖ్యంగా ఈ మార్పు తెస్తూ మండల వ్యవస్థను ప్రవేశపెట్టినపుడు వారు పడిన ఇబ్బందులు, ఏమాత్రం తొణక్కుండా, బెణక్కుండా వాటిని అమలు చేయడంలో ఆయన తీసుకున్న చొరవ నాకు చాలా గుర్తుకొస్తున్నాయి. అంతే కాకుండా ఆ మార్పులు చాలా far reaching changes. నిజాం ప్రభుత్వం, బ్రిటిష్ ప్రభుత్వాల నాటి వ్యవస్థను కూకటి వేళ్లతో మార్చి, అందుకు ముఖ్యమైన పాత్ర వహించిన కరణం రామచంద్రరావు గారిని ఈ సభ, మన రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులకు, మెదక్ జిల్లా ప్రజలకు, ఆందరికీ నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని ఒక మంచి మిత్రుణ్ణి, ఒక సీనియర్ సభ్యుడిని కోల్పోయినందుకు బాధను వ్యక్తం చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి వి. సునీతా లక్ష్మారెడ్డి (వాకిటి):- అధ్యక్షా, స్వర్గీయ కరణం రామచంద్రరావు గారి సంతాప తీర్మానాన్ని ఈ సభలో ప్రవేశపెడతామన్నది ఊహించని సంఘటన. గత అసెంబ్లీ సమావేశాలలో కూడా వారు చాలా చురుకుగా పాల్గొని, తర్వాత అస్వస్థతకు గురై చనిపోయారు. వారు గ్రామ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి. గ్రామ సర్పంచి గానూ, ఇండిపెండెంటు శాసనసభ్యుడిగానూ పలు పర్యాయాలు తెలుగుదేశం పార్టీ సభ్యులు గానూ, మంత్రి గానూ ఉంటూ పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. వారీనాడు మన మధ్య లేకపోయినా వారు చేసిన కార్యక్రమాలు చిరస్థాయిగా మిగిలిపోతాయి. మా జిల్లాకు సంబంధించిన సమస్యలను వారి దృష్టికి తెచ్చినపుడు పార్టీలకు అతీతంగా ఆ సమస్యలకు పరిష్కారానికి తీవ్రంగా స్పందించి కృషి చేసేవారు. అటువంటి వ్యక్తి ఈనాడు మన మధ్య లేకపోవడం , మా జిల్లాకే కాక, మన రాష్ట్రానికి కూడా తీరని లోటని మనవి చేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ పి. బాబూమోహన్ (అందోల్):- అధ్యక్షా, గౌరవనీయులైన కీర్తిశేషులు కరణం రామచంద్రరావు గారు సర్పంచి స్థాయి నుంచి రాష్ట్ర మంత్రి వరకూ ఎదిగి, వారు పుట్టిన మండలానికి, నియోజకవర్గానికి, జిల్లాకు, రాష్ట్రానికి కూడా ఎంతో సేవ చేసిన మహనీయులైన నాయకులు. అటువంటి మహా నాయకులు మరణించడం మెదక్ జిల్లాకు, మెదక్ జిల్లా ప్రజలకు తీరని లోటు.

అధ్యక్షా, వారు రాష్ట్ర మంత్రివర్యులుగా ఉన్నపుడు ఏనాడూ కూడా తాను మంత్రినని, పెద్ద హోదాలో ఉన్నానని భావించలేదు. చిన్న వారిని, సామాన్యులను కూడా చేరదీసి, పలకరించేవారు. ఎవరైనా ఇంటికి వస్తే వారు ఎవరని కూడా చూడకుండా, పేదవాడా, ఉన్నవాడా అని చూడకుండా, ' ఏంటయ్యా, ఎక్కడ నుంచి వచ్చావు? ఉత్తరం ఇవ్వమంటావా, ఫోను చెయ్యమంటావా?' అని అడిగి, చేరదీసి వారి పనులు చేసి పంపిస్తూ వుండేవారు. నేను చాలా సార్లు చూశాను.

ఉ 10 .00

వారిని మొదటిసారి నేను ఉప ఎన్నికలో పోటీ చేసినప్పుడు చూశాను . నేను గెలిచిన తరువాత కూడా, నేను సర్వీసులో చాలా పెద్దవాడిని, వీరంతా చిన్నవారు అనే భావన లేకుండా నన్ను సోదరభావంతో చేరదీసి, నేను ఏది అడిగితే అది చేస్తూ, బాబూ మోహన్‌గారూ, అని ఎంతో గౌరవంగా పిలిచేవారు . అంతే కాకుండా సాధారణంగా రాజకీయాలలో ముఠాలు కట్టడం, తగాదాలు వంటివి ఉంటాయి . వాటికి విరుద్ధంగా , తాను సామాన్య నాయకుడిగా, అందరిని కలుపుకుని పోవాలని, ఎటువంటి భేషజం లేకుండా మెదక్ జిల్లా నాయకులందరినీ కలుపుకుని పోయిన మహా నాయకుడు భగవంతుని దగ్గరకు వెళ్లడం మెదక్ జిల్లా ప్రజలకు, రాష్ట్రానికి తీరనిలోటు . ఆ లోటు ఇప్పుడు మాకు తెలుస్తున్నది . మాకు పెద్దదిక్కు లేకుండా పోయింది . మేము ఎక్కడెక్కడ వున్నా పిలిపించుకుని, కలిసి చాలా రోజులు అయింది సాయంత్రం కాఫీకి రండి అని పిలిపించుకునేవారు . పెద్దదిక్కుగా మేము చూచుకునే శ్రీ కరణం రామచంద్ర రావుగారి మృతి పట్ల తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి కలిగి, వారి కుటుంబసభ్యులకు మనోధైర్యం కలగాలని కోరుకుంటూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాపతీర్మానాన్ని బలపరుస్తున్నాను .

శ్రీ ఎ. విఠల్ రెడ్డి (రామాయంపేట్)ః అధ్యక్షా, శ్రీ కరణం రామచంద్ర రావుగారు నా చిన్ననాటి స్నేహితుడు . వారు నేను 5వ తరగతి నుండి గ్రాడ్యుయేషన్ వరకు సహాధ్యాయులం . గ్రాడ్యుయేషన్ పూర్తయిన తరువాత వారు వారి గ్రామానికి, నేను మా గ్రామానికి సర్పంచులుగా ఉండడం జరిగింది . అయితే 1972 సంవత్సరంలో కాంగ్రెస్‌పార్టీ తరపున హైదరాబాద్ వాస్తవ్యులైన దేవేందర్ గారిని అక్కడ మైనారిటీస్, క్రిష్టియన్స్ ఎక్కువగా ఉన్నారని నిలబెట్టినపుడు , అక్కడ వున్న కాంగ్రెస్‌వారు ఒక ఆలోచన చేసి కరణం రామచంద్ర రావుగారిని ఇండిపెండెంట్ అభ్యర్థిగా నిలబెట్టడం జరిగింది . ఆ విధంగా 1972 లో ఇండిపెండెంట్ శాసనసభ్యునిగా ఎన్నికయిన విషయం మీ దృష్టికి తెస్తున్నాను . ఆ తరువాత శ్రీ వెంగళ రావుగారికి సన్నిహితులుగా ఉంటూ 1975 లో రెడ్డి కాంగ్రెస్ తరపున పోటీచేశారు . ఆ తరువాత 1983 లో తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికయిన తరువాత మంత్రిపదవి లభించడం, జిల్లాలో ఎక్కువ సంవత్సరాలు మంత్రిగా వున్న నాయకుడు, జిల్లాలో, ఈ పార్టీ, ఆ పార్టీ అనకుండా అందరికీ సన్నిహితంగా ఉండి జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు . అటువంటి నాయకుడు ఈ రోజు లేకపోవడం చాలా విచారకరం . వారి ఆత్మకు శాంతి కలగాలనీ, వారి కుటుంబసభ్యులకు ఆత్మస్థైర్యం ఇవ్వాలని భగవంతుని ప్రార్థిస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాపతీర్మానాన్ని బలపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను .

శ్రీ సి ముత్యంరెడ్డి (దొమ్మట)ః అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, శ్రీ కరణం రామచంద్ర రావుగారి అకాల మరణానికి చాలా చింతిస్తూ, బాధపడుతూ, మొట్టమొదటిసారిగా సర్పంచ్‌స్థాయి నుండి ప్రారంభించి సింగిల్ విండో ఛైర్మన్ తరువాత శ్రీ జలగం వెంగళ రావుగారి పీరియడ్‌లో ఇండిపెండెంట్ సభ్యుడై, దాదాపు 5 పర్యాయాలు మెదక్ జిల్లా నుండి ఎన్నికయి, మంత్రివర్యులుగా, పంచాయతీ రాజ్ మంత్రిగా, మండలీకరణలో కీలకపాత్ర వహించి పంచాయతీ వ్యవస్థ లో నూతన విధానం తేవడం జరిగింది . దాని తరువాత ఐడిసి ఛైర్మన్‌గా, కోపరేటివ్ మంత్రిగా, ఉన్నత విద్యా శాఖ మంత్రిగా పనిచేసి 51 రోజులు అస్వస్థతతో హాస్పిటల్లో ఉండగా, గౌరవ ముఖ్యమంత్రిగారు నాలుగయిదు సార్లు వెళ్లి పరామర్శించి, జపాన్ నుండి వారి వైద్యానికి కావలసిన పరికరాలను కూడా తెప్పించారు . దానితోపాటు వైద్యమంత్రి డా ఎన్ జనార్థన రెడ్డిగారు రెండు రోజులకు ఒకసారి వెళ్లి పరామర్శించడరం జరిగింది . వారి మరణం మెదక్ జిల్లాకు తీరనిలోటు,

ఆ లోటు భర్తీచేయలేము . మెదక్ జిల్లాలో చాలా సంవత్సరాల పాటు మంత్రిగా వున్న ఏకైకవ్యక్తి శ్రీ కరణం రామచంద్ర రావుగారు . గౌరవ ముఖ్యమంత్రిగారు సేవలందించినా, ప్రభుత్వం వైపు నుండి శ్రీ ఎన్ జనార్థన రెడ్డిగారు సేవలందించినా ప్రయోజనం లేకుండా పోయింది . వారు జిల్లాలో వున్న నాయకులు ఎవరినీ నొప్పించకుండా అజాతశత్రువు లాగా ఎవరినీ నొప్పించకుండా అందరితో కలిసి అభివృద్ధి పనులు చేసేవారు . వారు ఈ 5 సంవత్సరాలు ఉంటారని భావించాము . వారు అనుకోకుండా అకాల మరణం పొందారు . వారిని కోల్పోయినందుకు బాధపడుతూ, వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబసభ్యులకు ధైర్యం ప్రసాదించాలని భగవంతుని కోరుకుంటూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను .

శ్రీ కె సత్యనారాయణ (సంగారెడ్డి)ః అధ్యక్షా, రాష్ట్ర ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని మనస్ఫూర్తిగా బలపరుస్తూ, స్వర్గీయ శ్రీ కరణం రామచంద్ర రావు గారు నేను 1984 లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కలిసి పనిచేయడం జరిగింది . చాలా సన్నిహితంగా, అవగాహనతో, చాలా విషయాల్లో మార్గదర్శకంగా ఉండి పనిచేసిన వ్యక్తి . ఆయనను కోల్పోవడం జిల్లా ప్రజలకు, రాష్ట్రప్రజలకు, పర్సనల్‌గా నాకు కూడా లోటు అని భావిస్తున్నాను . వారు చాలా పెద్దమనసుతో రాష్ట్రప్రజలందరిన కలుపుకుని కొన్ని సందర్భాలలో తోటి శాసనసభ్యులు కోపగించుకున్నా కూడా బాధపడకుండా, అందరితో సన్నిహితంగా మాట్లాడడం, అందరిని కలుపుకుపోయే మనస్తత్వం, ఎంతో శాంతంగా, ఓపికగా వినడం వంటి ఆదర్శవంతమైన లక్షణాలున్న నాయకుడు . 5 సార్లు జిల్లా నుండి శాసనసభ్యునిగా ఎన్నిక కావడం జరిగిందంటే ఆయన మంచితనానికి నిదర్శనం . అంతమంచి మనిషి లేకపోవడం నిజంగా ఆ నియోజకవర్గానికి తీరనిలోటు . శ్రీ కరణం రామచంద్ర రావుగారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను .

శ్రీ బి గోవర్ధన్ (మునుగోడు)ః అధ్యక్షా, ఈ రోజు గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి పూర్తి మద్దతు మాపార్టీ తరఫున తెలుపుతూ, పెద్దలు కీర్తిశేషులు శ్రీ కరణం రామచంద్ర రావు, నిగర్వి, సౌమ్యులు .
ఉ.10.10

ఒకటి రెండు సార్లు నా నియోజక వర్గ అభివృద్ధి పనుల గురించి వెళ్లి కలిసినపుడు బాగా స్పందించి, సత్వరమే చర్యలను తీసుకున్న వ్యక్తి ఆయన. కాబట్టి ఈ రోజు అటువంటి మంచి వ్యక్తి మన మధ్య లేకపోవడమనేది తీవ్ర మనస్తాపానికి గురి చేస్తోంది. ముఖ్యమంత్రి గారు వారి గురించి మాట్లాడుతూ, వారి తీవ్ర అనారోగ్యానికి గల కారణం పూర్తిగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడమేనని డాక్టర్లు చెప్పారని చెప్పడం జరిగింది. వారికి స్వస్థత చేకూరడం గురించి జర్మనీ నుంచి రు.25.00 లక్షలు వెచ్చించి ఎక్విప్‌మెంట్ తీసుకొచ్చినా ఉపయోగం లేకపోయిందని చెప్పారు.

కాబట్టి మన రాష్ట్ర ప్రభుత్వానికీ, మన గౌరవ ముఖ్య మంత్రిగారికీ నా చిన్న సజెషన్ ఏమిటంటే, నా చిన్నతనంలో, మా జిల్లాలో కీర్తి శేషులు రాజారామ్‌గారు మంత్రిగా వున్నపుడు, ఆయన మా జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో వున్నపుడు ప్రతి రోజూ గవర్నమెంట్ డాక్టర్ వచ్చి హెల్త్ చెకప్ చేసి వెళ్లేవారు. ఈ రోజు అటువంటి పరిస్థితి లేదు. నా సజెషన్ ఏమిటంటే జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో చాలా మంది ఎం.ఎల్.ఎ.లు వుంటారు కాబట్టి, కనీసం నలుగురైదుగురు ఎం.ఎల్.ఎ.లు వుంటారు కాబట్టి వారిని ప్రతి రోజూ ఉదయం గవర్నమెంట్ డాక్టర్ వచ్చి హెల్త్ చెకప్ చేసి వెళితే ఏదైనా ఎబ్‌నార్మాలిటీ డిటెక్ట్ అయితే హైదరాబాదు వచ్చి చెకప్ చేయించుకోవచ్చు. ఆ విషయంలో శ్రద్ధ చూపించాలని కోరుతున్నాను.

మనం రాజకీయాలలో వున్నాము కాబట్టి బిజీగా వుంటాము, టైమ్‌కి భోజనం చేసే పరిస్థితి లేదు. బి.పి. కాని, షుగర్ కాని వచ్చినా మనకు తెలిసే అవకాశం లేదు. మనం ఇక్కడ వున్నపుడు పరవాలేదు, ఇక్కడే చూపించుకుంటాము, కాని హెడ్‌క్వార్టర్స్‌లో వున్నపుడే ప్రాబ్లమ్ వస్తుంది. అందువల్ల గౌరవ శాసన సభ్యులందరికీ, గౌరవ ముఖ్యమంత్రి గారికీ నా మనవి ఏమిటంటే హెడ్ క్వార్టర్స్‌లో వున్నపుడే హెల్త్ చెకప్ చేయించే ఏర్పాటును చేయించాలి. ఉదాహరణకు మా నియోజక వర్గమైన ఆర్మూరులో అక్కడ వుండే గవర్నమెంట్ డాక్టర్ చేత శాసన సభ్యులకు హెల్త్ చెకప్ చేసే విధంగా ఏర్పాటు చేయాలి. అదే విధంగా రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాలలో వుండే శాసన సభ్యులకు ఈ విధమైన ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఎందుకంటే, ఒక తీవ్రమైన అనారోగ్యం వచ్చి, జబ్బు ముదిరిపోయిన తరువాత ఎన్ని లక్షలు ఖర్చు పెట్టి ఎక్విప్‌మెంట్ తెప్పించినా ఉపయోగం వుండదు. అందుకని ఇప్పుడు నేను చెప్పిన విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

అందరికీ వైద్యం నిమిత్తం అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది కాబట్టి అటువంటి పరిస్థితులు రాకుండా ముందుగానే హెల్త్ చెకప్ చేయిస్తే బాగుంటుందని మనవి చేస్తున్నాను. పెద్దలు కరణం రామచంద్రరావు గారి మృతి పట్ల నా తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ టి.జి. వెంకటేశ్ (కర్నూల్): అధ్యక్షా, దివంగత ఉన్నత విద్యాశాఖా మంత్రి శ్రీ కరణం రామచంద్ర రావు గారు చాలా మంచి స్నేహశీలి, మంచి నాయకులు, ఆణిముత్యం వంటి వారు. సీనియర్ నాయకులుగా, మంచికి మారుపేరుగా, న్యాయంగా, సాక్షాత్ ఆ శ్రీరామచంద్రుని అడుగుజాడలలో నడిచి శ్రీరామునిలాగే పరిపాలన చేయడానికి చాలా చక్కటి ప్రయత్నం చేసారు. ఆయన వరుసగా 5 సార్లు అదే అసెంబ్లీ నియోజక వర్గం నుండి గెలిచారంటే, ప్రజలకు ఆయనపై ఎంత అభిమానం వుందో అర్థం చేసుకోవచ్చు.

ఆయన అందరితోనూ మంచిగా మెలిగేవారు. వచ్చిన వ్యక్తులు ఎవరని చూడకుండా వారు తెచ్చిన పనులు మంచివైతే అక్కడికక్కడే చేసి పంపించేవారు. అటువంటి గొప్పవారు ఇప్పుడు మన మధ్య లేరు. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ నేను సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి (రాపూర్): రెస్పెక్టెడ్ మేడమ్ స్పీకర్, కీర్తిశేషులు, పూజ్యులు శ్రీ కరణం రామచంద్రరావు గారి మృతి పట్ల శాసన సభలో గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని పూర్తిగా నేను బలపరుస్తున్నాను. 1983 నుంచి పూజ్యులు శ్రీ కరణం రామచంద్రరావు గారితో కలసి గతంలో 2 దఫాలు, ఈ దఫా కూడా శాసన సభ్యునిగా వుండే అవకాశం మాకు క లిగింది.

ఆనాడు మొట్టమొదటిసారిగా శాసన సభకు మేము ఎంపికై వచ్చినపుడు అప్పటికి ఆయన 2 దఫాలుగా శాసన సభ్యునిగా వుండి, మాకందరికీ కూడా మార్గదర్శకునిగా వుండి, సభలో ఏ విధమైన రీతిలో ప్రవర్తించాలనే విషయంలో ఆయన ఎంతో అనుభవ పూర్వకంగా మమ్మల్ని నడిపించిన విషయం ఈనాడు గుర్తు చేసుకోవలసిన అవసరం వుంది. ఆయన పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా వున్నపుడు ఆనాడు ముఖ్యమంత్రిగా వున్న స్వర్గీయ ఎన్.టి.రామారావు గారు మండల విధానాన్ని ప్రవేశపెట్టి దానిని చట్టబద్ధం చేసినపుడు ఎన్నో ఒడిదుడుకులు, వత్తిళ్లు వచ్చినా వాటిని తట్టుకుని, ఒక క్రమబద్ధంగా చట్టాన్ని చేసిన సందర్భంలో పూజ్యులు శ్రీ కరణం రామచంద్రరావు గారు ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ ఈ రాష్ట్రానికి మండల వ్యవస్థను అందించడం జరిగింది.

సహకార శాఖా మంత్రిగా, ఆ తరువాత విద్యాశాఖా మంత్రిగా కూడా వారు మా జిల్లాకు వచ్చినపుడు ఎన్నో సంస్కరణల విషయంలో చర్చించడం, విద్యా విధానంలో మంచి సంస్కరణలను తేవాలి, నేటి సమాజానికి ఉపయోగించే విద్యా విధానాన్ని అందించాలనే స్ఫూర్తి కలిగిన వ్యక్తి పూజ్యులు శ్రీ కరణం రామచంద్రరావు గారు. 1972 నుంచి, అంతకు ముందు ఆయన గ్రామ సర్పంచ్‌గా వున్నప్పటినుంచీ, మా కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కలిగిన వ్యక్తి. అటువంటి వ్యక్తి ఈనాడు ఈ సభలో మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమైన విషయం.

అందుకనే పూజ్యులు శ్రీ కరణం రామచంద్రరావు గారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గౌరవ ముఖ్యమంత్రిగారికి ఒక విజ్ఞప్తిని చేస్తున్నాను. ఈ దఫా కరణం రామచంద్రరావు గారు అనారోగ్యంగా వున్నపుడు ప్రభుత్వం ఒక ఎక్విప్‌మెంట్ తెప్పించడం జరిగింది. అదే విధంగా గతంలో కూడా కొందరు శాసన సభ్యులకు, మంత్రులకు ఆరోగ్యం బాగోలేనపుడు కూడా ఎక్విప్‌మెంట్ తీసుకురావడం జరిగింది. ఆ విధంగా కాకుండా ఒక ఫుల్‌ఫ్లెడ్జ్‌డ్ హాస్పిటల్ ఈ రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటే, భవిష్యత్తులో ఎవరికి ఎప్పుడు బాగోలేకపోయినా, అప్పుడు తెప్పించుకునే పద్ధతి కాకుండా ఫుల్లీ ఎక్విప్డ్ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచిస్తూ, ఈ అవకాశం ఇచ్చిన తమకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ నేను సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వై.రామకృష్ణుడు : అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు శ్రీ కరణం రామచంద్రరావు గారి మృతి పట్ల ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని నేను బలపరుస్తున్నాను. పూజ్యులు శ్రీ కరణం రామచంద్రరావు గారు మొట్టమొదటగా 1983వ సంవత్సరంలో పరిచయమయ్యారు. ఆనాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి క్యాబినెట్‌లో శ్రీ కరణం రామచంద్రరావు గారు, తమరు, నేను కూడా మొట్టమొదటగా మంత్రివర్గంలో వుండడం జరిగింది. ఆ రోజు నుంచి ఒక మంచి స్నేహశీలిగా, ఒక పెద్ద మనిషిగా, శాంతమూర్తిగా, మంచి మనసు కలిగిన వ్యక్తిగా పరిచయం అయినప్పటి నుంచీ చివరి రోజుల వరకూ కూడా అదే రకమైన ఆలోచనలతో, అలవాట్లతో, మంచి మనసుతో వున్న మహా మనిషి.

ఆ రోజు కొత్తగా క్యాబినెట్ ఏర్పడ్డ క్యాబినెట్‌లో తమరు కాని, నేను కాని చేరడం జరిగింది. అప్పటికే ఆయన అనుభవం వున్న వ్యక్తిగా వుండి, 'అగ్రజులు' అని పిలిచి ఆయన సలహాలను ఎప్పటికప్పుడు తీసుకుంటూ వుండేవారం. చాలా సున్నితమైన మనస్తత్వం కలిగిన వ్యక్తి, మంచి అభిప్రాయాలు కలిగిన ఒక మంచి వ్యక్తి ఆయన. క్యాబినెట్‌లో కాని, బయట విషయాలలో కాని, ఎవరినీ నొప్పించని మంచి వ్యక్తిగా ఆయన గురించి చెప్పకతప్పదు. పంచాయతీరాజ్ మినిస్టర్‌గా ఆయన బాగా గుర్తింపబడడం జరిగింది. పంచాయతీరాజ్ మినిస్టర్‌గా వున్నపుడు మండల విధానాన్ని ప్రవేశపెట్టడమే కాకుండా, మండల విధానం యొక్క ఉద్దేశాలను పూర్తిగా అవగాహన చేసుకున్న, ఒక సదవగాహన కలిగిన వ్యక్తి.
ఉ. 10.20

శాసనసభలో మాండలిక వ్యవస్థకి సంబంధించి బిల్లు ప్రవేశపెట్టినప్పుడు,దాదాపు ఒకటిన్నర గంటల సేపు బిల్ యొక్క ఉద్దేశ్యాన్ని, బ్యాక్‌గ్రౌండ్‌ని సభకి వివరించారు. స్థానిక సంస్థలను బలపరచాలన్న ఉద్దేశ్యంతో ఆనాడు ఎన్.టి.రామారావు గారి ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానం గురించి ఈ శాసనసభలోనే కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా దాని విశిష్టతను చక్కగా ఆయన చెప్పగలిగారు. అటువంటి మంచి మనస్సు కలిగిన వ్యక్తి ఈ శాసనసభలో నేడు లేకపోవడమన్నది చాలా దురదృష్టకరం అని తెలియజేస్తున్నాను. నాకు వ్యకిగతంగానే కాకుండా, రాష్ట్రానికి, శాసనసభకి వారు లేని లోటు కనిపిస్తున్నది. శ్రీ కరణం రామచంద్రరావు గారు ఏ లోకంలో ఉన్నా వారికి మనశ్శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

మేడమ్ స్పీకర్ :- శ్రీ కరణం రామ చంద్ర రావు గారు 1972-78, 1983-84, 1985-89, 1994-99 మరియు 1999 -2000 సంవత్సరంలో మెదక్ నియోజక వర్గంనకు శాసనసభా సభ్యునిగా ప్రాతినిధ్యం వహించారు. వీరు 1964 వ సంవత్సరంలో కొత్తపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై అంచలంచెలుగా మంత్రి పదవి స్థాయికి ఎదిగారు. వృతిరీత్యా వ్యవసాయదారుడైన రామచంద్రరావు గారు కొత్తపల్లి సర్పంచ్‌గా ఎమ్.పి.సి.ఎస్. ప్రెసిడెంట్‌గా, ఏడుపాయల దుర్గా భవాని దేవాలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్‌గా, జోగిపేట వ్యవసాయాభివృద్ధి బ్యాంక్ మెంబరుగా, ప్రారిశ్రామిక అభివృద్ధి మండలి ఛైర్మన్‌గా పనిచేశారు. వీరు తమ పదవీ కాలంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా, సహకార శాఖా మంత్రిగా మరియు ఉన్నత విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. వీరు ఏ హోదాలో ఉన్నా తమ కర్తవ్యాన్ని సమర్ధవంతముగా నిర్వహించారు. వీరు నిరాడంబరులు, నిగర్వి, మరియు స్నేహశీలి. వీరు శాసనసభా కమిటీలలో సభ్యునిగా, ఛైర్మన్‌గా పనిచేశారు. వీరు మెదక్ జిల్లా అభివృద్ధికి ఎంతో కృషిచేశారు. ''కాలం మారిన కొద్దీ నైతిక విలువలు పడిపోతున్నాయి. వీటిని పునరుద్ధరించాలి. ఊపిరి ఉన్నంత కాలం సమాజసేవ చేయాలన్నదే లక్ష్యం'' అని శ్రీ రామచంద్రరావు గారు తరచుగా'' అనేవారు.

వీరు కొంతకాలంగా అస్వస్థులుగా వుంటూ మే13, 2002వ తేదీన మరణించారు. వీరి వయస్సు 62 సంవత్సరములు.

వీరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. వీరి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలపాటు మౌనం పాటిద్దాం.

**( సభ రెండు నిమిషాల పాటు మౌనము పాటించింది.)**

MADAM SPEAKER: Now, the House is adjourned to meet again at 8.30 a.m. tomorrow.

(Then the House adjourned at 10.24 a.m. to meet again at 8.30 a.m., on Tuesday, the 16th July, 2002.)